కక్ష కట్టారు..కడ తేర్చారు

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప నగరంలో ఆదివారం తెల్లవారుజామున అమీన్ ఫంక్షన్ హాల్ వద్ద ఓ వ్యక్తిపై కత్తితో విచక్షణ రహితంగా పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పెద్ద దర్గా ఉరుసుకు శనివారం రాత్రి నగరంలోని కుమ్మరి కుంట ప్రాంతానికి చెందిన 'షేక్ గౌస్ బాషా (18) అలియాస్ అబూబకర్ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. గతంలో అబూబకర్‌తో గౌస్ బాషకు ఓ మహిళ విషయంలో మనస్పర్థలు ఉండేవని, వీటిని మనసులో ఉంచుకుని అతని దగ్గరకు వెళ్లి గొడవకు దిగారని పేర్కొన్నారు. అక్కడే మరి కొంతమంది అబూబకర్‌కు తోడై గౌస్ బాషను ఉరుసు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. యూసుఫ్ అనే వ్యక్తి గౌస్ బాషను కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. హత్యకు పాల్పడ్డ వారిని పట్టుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే

సోషలిస్టు వ్యవస్థ సాధ్యం

- ప్రజాస్వామ్యానికి బద్ధ శత్రువు బిజెపి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజల భాగస్వామ్యంతోనే దేశంలో సోషలిస్టు వ్యవస్థ సాధ్యమవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచాన్ని మలుపు తిప్పిన 'అక్టోబర్ మహా విప్లవ సభ' నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 1917, రష్యా అక్టోబర్ మహా విప్లవం ప్రపంచమంతా సామ్రాజ్యవాద దేశాలకు, రాచరిక రాజ్యాలకు, జమీందారీ, భూస్వామ్య వ్యవస్థలకు, దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం, సోషలిస్టు దేశాలు ఏర్పాటుకు ప్రజా తిరుగుబాటులకు, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. ప్రపంచంలోనే 300 సంవత్సరాల పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి దీటుగా 30 సంవత్సరాలలో 'రష్యా అక్టోబర్ మహా విప్లవం' సోషలిస్టు వ్యవస్థ నిర్మాణ నమూనా అభివృద్ధి అధిగమించి శాస్త్ర, సాంకేతిక, మానవ వనరుల పురోగమనానికి, అన్ని రంగాలలో ప్రగతి సాధించగలిగిందన్నారు. భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం అనేక త్యాగాలతో పోరాటాలు, ప్రజా తిరుగుబాటులకు నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. రష్యా విప్లవంతో ప్రభావితులైన మహాత్మ జ్యోతిరావు పూలే స్త్రీవిద్యను ప్రోత్సహించారన్నారు. నెహ్రూ కాంగ్రెస్ పార్టీలోనే కాంగ్రెస్ సోషలిస్టు విభాగాన్ని ఏర్పాటు చేశారన్నారు. అంబేద్కర్, పిరియర్, జయప్రకాశ్ నారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, కర్పూరి ఠాగూర్ లాంటి వారు, శూద్ర కులాల మేధావులు నడిపిన సామాజిక, ఆర్థిక ఉద్యమాలలో కూడా భారత దేశ భవిష్యత్తు సమానత్వం, సార్వభౌమత్వం, సామాజిక న్యాయం సాధనగా సాగాయని తెలిపారు. దేశంలో బిజెపి మైనార్టీ ప్రభుత్వాన్ని నడుపుతోందని, 12 రాష్ట్రాలలో ఓడిపోయిన బిజెపి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి అధికారంలో కొనసాగుతోందని విమర్శించారు. 2014 నుంచి 2024 వరకు నరేంద్ర మోడీ ప్రధాని బిజెపి ప్రభుత్వంలో డబ్బు, మద్యం, హింస, కిడ్నాప్ పెరిగాయని ఎద్దేవ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగతంగా ఉన్న మతాన్ని రాజకీయాల్లోకి లాగి మతతత్వాన్ని రెచ్చగొడుతున్నారని, మారణహోమాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ దోపిడిని మత ఉన్మాదాన్ని కలుపుకుని కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కొనసాగుతుందని, ప్రజల పైన పడుతున్న పెనుభారాలకు, ప్రజా దోపిడీకి, పాలకుల, కార్పొరేట్ల స్నేహమే కారణమనే సత్యాన్ని ప్రజలు తెలుసుకుంటున్నారని చెప్పారు. ప్రజా ప్రతిఘటనలు ప్రారంభమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ సామ్రాజ్యవాద దేశాలకు నాయకత్వం వహిస్తున్న అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యూయార్క్‌లో డెమొక్రటిక్ సోషలిస్టులు ఎన్నికల్లో గెలుస్తున్నారని ఇది ప్రపంచంలో సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారీ విధానాన్ని ప్రజలు తిరస్కరిస్తున్నట్లుగా అందరూ గుర్తిస్తున్నారని తెలిపారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఎల్లా గువేరా, కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, శివరాం, రామ్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజేశ్వరమ్మ, సిపిఎం, ప్రజానాట్యమండలి కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

న్యాయసేవల దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సి. యామిని

ప్రజాశక్తి - కడప

మహిళలు, పిల్లలు, షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, మానవ అక్రమ రవాణా బాధితులు అలాగే ప్రకృతి వైపరీత్యాల బాధితులైన బలహీన వర్గాలకు దేశవ్యాప్తంగా ఎటువంటి రుసుం లేకుండా న్యాయ సేవలను అందించడం న్యాయ సేవల దినోత్సవం ముఖ్య లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని అన్నారు. ఆదివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో న్యాయ సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 2025 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ పారా లీగల్ వాలంటీర్ అవార్డును కడప జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పొందింది అని ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌరవ సుప్రీంకోర్టు 1995లో న్యాయ సేవల దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ప్రవేశపెట్టిన నల్సా పథకాలను, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, న్యాయ విజ్ఞాన సదస్సులు, ఉచిత న్యాయ సహాయాలు, ఫ్రంట్ ఆఫీస్, లీగల్ ఎయిడ్ క్లినిక్, ఇంటింటి న్యాయ ప్రచారాలను వివరించారు. జిల్లావ్యాప్తంగా న్యాయవిజ్ఞాన సదస్సులు 838, ఇంటింటి న్యాయ ప్రచారం ద్వారా 90305 ప్రత్యక్షంగా అవగాహన, 573 మంది నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒంటరి మహిళ పెన్షన్లు, గిరిజన ప్రాంతాలలో ఎలక్ట్రిక్ స్తంభాలు, లైట్లను ఏర్పాటు చేయడం చెప్పారు. 214 మందికి ఉచిత న్యాయ సహాయం, 43 కేసులు మీడియేషన్‌లో పరిష్కరించామని చెప్పారు. మూడు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 53001 కేసులు పరిష్కరించి రూ. 76 .92 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరైనా వారి సమ స్యలను అర్జీ రూపంలో సమర్పిస్తే వెనువెంటనే సంబంధిత అధికా రులకు పంపించి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫ్రీ లిటిగేషన్ కేసులు, జాతీయ లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం పట్ల అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా 'లీగల్ సర్వీసెస్ స్కీమ్స్, ప్రోగ్రా మ్స్' అనే అంశంపై విద్యాసంస్థలలో వ్యాసరచన, వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు న్యాయమూర్తులచే సర్టిఫికెట్లు ఈ సందర్భంగా అందజేశారు. అంతకుముందు జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్ వరకు, అంబేద్కర్ సర్కిల్ నుంచి కోర్టు ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని ప్రారంభించారు. కార్యక్రమంలో 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ మరియు కడప ఇంచార్జ్ సెక్రెటరీ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జి.సి. ఆసిఫా సుల్తానా, కడప ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జ్ ఎం.రేష్మ, కడప సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జ్ ఎం, ఈశ్వర్ వెంకటప్రసాద్, ప్రభుత్వ అధికారులు, బార్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, పార లీగల్ వాలంటరీలు, ఎన్జీవోలు, వివిధ స్కూళ్లు, విద్యార్థులు, టీచర్లు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

కర్షక కవి దువ్వూరి రామిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కవిగా, రచయితగా, విమర్శకులుగా, నాటక కర్తగా ప్రసిద్ధులైన కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి సంప్రదాయ రీతులను మిళితం చేసి కొత్త తరానికి సాహితీ బాటలు వేశారని కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. ఆదివారం కడప రెడ్డి సేవా సమితి సమావేశ మందిరంలో ఆదివారం 'కర్షక కవి' దువ్వూరి రామిరెడ్డి 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ దువ్వూరి వారి శైలి ప్రత్యేకమైందని,ఆయన కలకండ వంటి కమ్మని కావ్యాలు రాయడమే కాకుండా,అరబిక్ భాషల నుంచి ఎన్నో గ్రంథాలను నవ్య రీతిలో ఆంధ్రీకరించిన ఘనుడని చెప్పారు. ఆయనకు 1929లో విజయవాడ ఆంధ్ర మహాసభ ద్వారా' కవి కోకిల 'బిరుదు ప్రదానం చేశారని తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ప్రధాన వక్తగా మాట్లాడుతూ 'సింహపురి సిరి' గా పేరు తెచ్చుకున్న దువ్వూరి రామిరెడ్డి ఆధునిక సాహిత్య చరిత్రలో పరిచయం అక్కరలేని ప్రసిద్ధ కవియని, ఆయన రాసిన కృషీవలుడు అద్భుతమైన కావ్యమని పేర్కొన్నారు. దువ్వూరి వన కుమారి కావ్యం విజయనగరం మహారాజ ఆస్థానంలో కావ్య స్పర్ధలో ప్రథమ స్థానం పొందిందని చెప్పారు. నాగూరు రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ చిత్రనళీయం సినిమాకు కథ రాసి, దర్శకత్వం వహించిన మొట్టమొదటి తెలుగు కవి దువ్వూరి వారే అన్నారు. రెడ్డి సేవా సమితి కోశాధికారి గుడ్ల ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన దువ్వూరి రామిరెడ్డి సాహిత్య రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవి అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి వసతి గృహ విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు : వైసిపి

ప్రజాశక్తి-కడప : అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా అన్నారు. కడప నగరంలోని 27వ డివిజన్‌లో వైసిపి నాయకులు కో - ఆప్షన్ సభ్యులు జహీర్, ఇతరులపై అక్రమ కేసులు నమోదైన నేపథ్యంలో ఆయన ఆదివారం రిజ్వాన్ మసీద్ వద్ద ఉన్న సలీం, గౌస్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, అక్రమ కేసులు తమకు కొత్త కాదన్నారు. ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని, న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం కలిగి ఉన్నామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా ప్రతి అన్యాయానికి సమా ధానం ఇస్తామని హెచ్చరించారు. కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అలీ అక్బర్, షంషీర్, మహమ్మద్ షఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, నాయకులు మొహమ్మద్ అలీ, ఫయాజ్, ఖదీర్, ఖాదర్ బాషా, మహబూబ్ బాషా, జోష్, బాబాజహూర్, అలీ, ఆరిఫ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు. తన కార్యాలయంలో మేయర్ ముం తాజ్ బేగం, వైసిపి నాయకులతో కలిసి ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్క రించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ గేమ్ చేంజర్ అని చంద్రబాబు నేమ్ చేంజర్ అని పేర్కొన్నారు.

అంబవరం చెరువు నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి - వల్లూరు : మండల కేంద్రంలోని అంబవరం చెరువు నుంచి వ్యవసాయం కోసం కాలువలకు ఆదివారం సాయంత్రం టిడిపిరాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని పంటలు బాగా పండించాలని కోరారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురవడంతో అంబవరం చెరువు నిండు కుండలా ఉందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించే కార్యక్రమంలో మండల సొసైటీ బ్యాంక్ చైర్మన్ లేబాక నాగేశ్వర్‌రెడ్డి, మండల టిడిపి నాయకుడు రామసుబ్బారెడ్డి నీటి సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఖాజా రంతుల్లాకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కలసపాడు

ఖాజా రంతుల్లాను సన్మానిస్తున్న నాయకులు

ఎపి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఖాజా రంతుల్లాకు టిడిపి నాయకులు స్వామి రంగారెడ్డి ఆదివారం విజయవాడలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా రంతుల్లా మాట్లాడుతూ కలసపాడు మండలం నుంచి టిడిపి నాయకులు పెద్దయెత్తున తన ప్రమాణ స్వీకారం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తకూ టిడిపి అండగా వుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగువ సగిలేరు నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లె చిన్న రంగారెడ్డి, యువ నాయకుడు స్వామి రంగారెడ్డి ,పెండ్లిమర్రి వెంకటరామిరెడ్డి, యల్లయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సుమన్, అలీ

పెద్దదర్గాలో సినీ నటులు

సుమన్, అలీ ప్రార్థనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ సినీనటులు సుమన్, అలీ వేర్వేరుగా కడప అమీన్‌పీర్ దర్గాను సందర్శించారు. దర్గా నిర్వాహకులు ఇరువురిని సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం సినీ నటులు ప్రత్యేక ప్రార్థనలు చేసి దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి -కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్‌డిమాండ్ చేశారు. ఆదివారం యూటిఎఫ్ కార్యాలయంలో మున్సిపల్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం కె. నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, పులివెందల ,బద్వేల్, కడప కార్పొరేషన్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలోనూ, లైట్లు వెలిగించడంలోనూ, నీళ్లు ఇవ్వడంలోనూ మున్సిపల్ కార్మికులు పాత్ర కీలకమని పేర్కొన్నారు.అలాంటి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్స్ సౌకర్యాలు లేకుండా ఇంటికి పంపించడం దుర్మార్గమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 62 సంవత్సరాల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలపు వేతనాన్ని ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. వాళ్ళ కుటుంబంలో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ కార్మికులు, క్లాప్ కార్మికులు మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇంజినీరింగ్, శానిటేషన్ కార్మికుల పరిస్థితి ఇదే విధంగా ఉన్నదని విమర్శించారు. సకాలంలో ఆయిల్ సోప్స్, బట్టలు, స్లిప్పర్స్, కొన్ని మున్సిపాలిటీలలో పనిముట్లు, సరిగా ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యల పైన సోమవారం అన్ని మున్సిపాలిటీలలో కమిషనర్లకు వినతి పత్రాలు ఇచ్చి బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు నిర్వహించే సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్.గోపి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, మున్సిపాలిటీ నాయకులు శేఖర్, నాగన్న, సాల్మన్, గురమ్మ, రాఘవ, రమాదేవి, నీతిమ్మ, రవి, తిరుపాల్, శ్రీరామ్, కిరణ్, ఆనంద్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మల్బరీతో అధిక ఆదాయం

- సిల్క్ సమగ్ర స్కీమ్ ద్వారా సబ్సిడీ
- తాజాగా టస్సర్, ఎరీకల్చర్ సాగుకు శ్రీకారం
- జిల్లా పట్టు పరిశ్రమశాఖ ఎడి ఎ.శివరామదీక్షిత్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

మల్బరీ సాగుతో అధిక ఆదాయం లభిస్తుంది. మల్బరీ మొక్క నాటిన దగ్గర నుంచి ఏడాది వ్యవధిలో ఐదు దశల వారీగా ఆదాయం వస్తుంది. జిల్లా వ్యవసాయశాఖకు అనుబంధశాఖగా సెరీకల్చర్ రైతుల ఇంట సిరుల పంట కురిస్తుంది. మల్బరీ సాగుతోపాటు టస్సర్ కల్చర్, ఎరీ కల్చర్ పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ సృజనకు శ్రీకారం చుట్టాం. ఇందుకుగానూ సమర్థ యాజ మాన్య పద్ధతులను పాటించాల్సి ఉంది. వి-1 వంటి ఆధునిక వంగడాలతో మల్బరీని సాగు చేసుకోవాలి. దళారీ రహిత ఆధునిక మార్కెటింగ్ సదుపాయం కారణంగా మంచి రైతుకు మంచి ఆదాయం లభిస్తోంది. సరుకును విక్రయించిన వెంటనే అప్పటికప్పుడే గానీ, బ్యాంకింగ్ ఆధారిత పేమెంట్ చేయడం జరుగుతుంది. మల్బరీ పంటకు ప్రకృతి వైపరీత్యాల ప్రభావం ఉండదు. తెగుళ్లు సోకే అవకాశమూ ఉండదు. ఇతర వాణిజ్య పంటల తరహాలో లక్షలాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయే అవకాశం ఉండదని పేర్కొంటున్న కడప పట్టు పరిశ్రమలశాఖఎడి ఎ.శివరామదీక్షిత్‌తో ముఖా ముఖి...

సెరీకల్చర్ సాగు లక్ష్యాల్ని తెలపండి?

జిల్లాలో 500 ఎకరాల్లో మల్బరీ సాగులో చేయాల్సి ఉంది. 2025- 26 ఆర్థిక సంవత్సర ఆగష్టు నాటికి 200 ఎకరాల సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి. ప్రస్తుత అక్టోబర్ మాసం చివరి నాటికి 145 ఎకరాల సాగు చేయాల్సి ఉండగా 93.37 శాతం మేర సాగు చేయడమైంది. మిగిలిన ఆరు శాతం లక్ష్యాన్ని మార్చి నాటికి సునాయాసంగా అధిగమించడానికి కృషి చేస్తాం.

సిల్క్ సమగ్ర స్కీమ్ వివరాలు వివరించండి?

ఎకరా నారు మొక్కల యూనిట్‌కు రూ.30 వేల మంజూరు చేస్తాం. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రూ.27,000, ఇతరులకు రూ.22,500 మేర సబ్సిడీ మంజూరు చేస్తాం. రీరింగ్ షెడ్డు నిర్మాణానికి రూ.5.60 లక్షలు మంజూరు చేస్తాం. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 5.04 లక్షలు కేటాయిస్తున్నాం. బిసి, ఓసి మల్బరీ రైతులకు రూ.4.20 లక్షలు మంజూరు చేయడం జరుగుతుంది. ఈలెక్కన ఎస్‌సి, ఎస్‌టిలకు 90 శాతం, ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ అంద జేస్తాం.

మల్బరీ రకాల గురించి తెలపండి?

జిల్లాలో సెరీకల్చర్ సాగుతోపాటు టస్సర్, ఎరీకల్చర్ వంటి రకాలున్నాయి. టస్సర్ కల్చర్ మద్ది మొక్కల సాగు ద్వారా సాగు చేయడం జరుగుతోంది. టస్సర్ కల్చర్ చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, అస్సాం తదితర రాష్ట్రాల్లో అమల్లో ఉంది. జిల్లాలోని వనిపెంట కేంద్రంలో ఎరీకల్చర్ సాగవుతోంది. సుమారు 1450 ఎకరాల్లో ఆముదపు ఆకుల ద్వారా పట్టు ఆధారిత ఉత్పత్తులను సాగు చేయవచ్చు.

మల్బరీ ఫామ్‌లెన్ని?

రెండు మల్బరీ ఫామ్స్ ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంట, కడప నగర సమీపంలోని ఊటుకూరులో మరొకటి. రెండు లక్షల మల్బరీ నారు మొక్కలను పెంచి రైతులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచుతున్నాం. రూ.2 చొప్పున నర్సరీ మొక్కలను అందజేస్తాం.

మల్బరీ విస్తరణ చర్యలేమిటి?

క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహి స్తాం. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (సిఎన్ఎఫ్) అధికారుల సహకారంతో రైతులను గుర్తించడం జరు గుతుంది. కలెక్టర్ ఆదేశాల ప్రకారం క్లస్టర్ గ్రామాల ద్వారా సాగు లక్ష్యాన్ని అందుకుంటాం. క్లస్టర్ గ్రామాల ఎంపిక చేయడం ద్వారా రైతులకు వనరుల లభ్యత, పెట్టుబడి, రాబడి పెరుగుతుంది.

గూళ్ల రకాలెన్ని?

బై ఓల్టేన్, సి.బి రకాలున్నాయి. ఏప్రిల్, మే, జూన్‌లో తెల్లగూళ్లు సాగు చేసుకోవచ్చు. సిపి గూళ్లు. తెల్లగూళ్లకు మార్కెట్లో కిలో రూ.750, సిపి గూళ్లకు రూ.50 ఇన్‌సెంటివ్ కింద ఇచ్చే అవకాశం ఉంది. రైతులే గూళ్లను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలి.

మార్కెట్ల వివరాలు తెలపండి?

మదనపల్లి, కుప్పం, కదిరి, ధర్మవరం, పలమనేరు, హిందూపురం మార్కె ట్లలో విక్రయించుకునే అవకాశం ఉంది. కర్నాటక రాష్ట్రంలోని రాంనగర్, సిద్దల గట్ట మార్కెట్లు అందుబాటులో ఉన్నాయి.

మల్బరీ దశలను వివరించండి?

నాలుగు జరాలు, ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పురుగు బయటికి వచ్చేది మొదటి దశ, మూడు రోజుల తర్వాత జరానికి పోవడం జరుగుతుంది. 24 రోజుల్లో పురుగు రూపంలో లార్వా దశ వస్తుంది. ఆరు నుంచి ఎనిమిది రోజుల తరువాత గూడు కట్టుకోవడాన్ని పీపా దశ అంటారు. ఐదవ రోజు మార్కెట్ పోవడం జరుగు తుంది. ఐదో రోజు మార్కె ట్ తీసుకెళ్లి ఇ- యాక్షన్ ద్వారా రీలర్స్‌కు విక్రయించాలి. రేటు ఇష్టం లేక పోతే సెకెండ్, థర్డ్ యాక్షన్స్‌కు వెళ్లొచ్చు. విక్రయ అనంతరం గంట తర్వాత రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

షెడ్ల ఏర్పాటు, సంరక్షణ ఎలా?

గ్రామీణ సమీప పొలాల్లో షెడ్లు ఏర్పాటు చేయాలి. 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 35 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో షెడ్లు నిర్మించాల్సి ఉంది. యూనిట్ విలువ రూ.4.50 లక్షలు అయితే ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ, ఎస్‌సి, ఎస్‌టి 90 శాతం సబ్సిడీ ఇస్తా రు. రూ.3.60 లక్షలు వస్తుంది. షెడ్ల అడుగు భాగంలో న్యూస్ పేపర్ పరిచి షూట్ ఫీడింగ్ (కొమ్మలు వేయడం) చేయాలి. నేత్రికలు, చాకీకట్టెలు ఏర్పాటు చేయాలి. సున్నం కొట్ట డంతో క్రిమి కీటకాదులు నశించి పోవడంతో తెగులు అనేది ఉండదు. ఫలి తంగా లేబర్ ఛార్జీ తగ్గుతుంది. కొమ్మ అధిక సమయం ఫ్రెష్‌గా ఉంటుంది.

పంట దశలను వివరించండి?

మూడు నెలల పాటు నారు సాగు చేయాల్సి ఉంటుంది. నాలుగున్నర నెలకు కోత దశకు చేరుకుంటుంది. ప్రతి 45 రోజులకోసారి పంట కోతకు వస్తుంది. ఈలెక్కన ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు తీసే అవకాశం ఉంది. దీంతో ఎకరా సాగుకు 250 నుంచి 300 గుళ్ల మేపవచ్చు. కోతకు రూ.90 వేల చొప్పున ఆరు కోతల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. ఈలెక్కన ఎకరానికి రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది

బ్యాడ్మింటన్ ఆడి క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

చిన్న వయసు నుంచే క్రీడాకారులు వారు ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని కడప నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ (యు-11) బాయ్స్, గర్ల్స్ స్పోర్ట్స్ ఛాంపియన్స్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. స్వయంగా బ్యాడ్మింటన్ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే క్రీడా పోటీలు నిర్వహిస్తే చిన్నారుల ప్రతిభ, అభివృద్ధికి మరింత బలం చేకూరుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కడప జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత మంది క్రీడాకారులు రాణించేందుకు అవసరమైన సదుపాయాలు, ప్రోత్సాహం, క్రీడా వాతావరణం కల్పించేందుకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడా సంఘ ప్రతినిధులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కడప, అనంతపురం మ్యాచ్ డ్రా

ప్రజాశక్తి - కడప : ఎసిఎ సౌత్ జోన్ అండర్-14 మల్టీ డే మెన్ టోర్నీలో భాగంగా వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 198 పరుగులు చేసింది. మూడు వికెట్ల నష్టానికి 54 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 71.5 ఓవర్లలో 147 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. కడప జట్టులోని వర్షిత్ రెడ్డి 3, విక్రాంత్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 46.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఆ జట్టులోని తాహిర్ 61 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని టేడ్రిక్ 2, క్రితిక్ సాయి రెండు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆధిక్యత సాధించింది.

బ్రౌన్ గ్రంథాలయం దేశానికి వారసత్వ సంపద

ప్రజాశక్తి- కడప అర్బన్ : సి.పి.బ్రౌన్ నివసించిన స్థలంలో ఏర్పడిన బ్రౌన్ స్మారక గ్రంథాలయం దేశానికి వారసత్వ సంపదని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇంటాక్ కన్వీనర్ సింగం లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి లాంటి మహనీయుల కృషి ఫలితంగా వెలసిన గ్రంథాలయంలోకి అడుగిడడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పరిశోధన కేంద్రంలో భద్రపరచిన ప్రాచీన తాళపత్రగ్రంథాలు, చేతితో తయారు చేసిన రాతప్రతులు, తామ్రపత్రం, నాణేలు లాంటి పలు ప్రాచీన సంపదను కాపాడడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలను ఇంటాక్ సంస్థ తరపున అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాశ్వత సభ్యత్వాన్ని పొందడం ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి పాల్గొన్నారు.

రికార్డులను తనికీ చేస్తున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

ఎలాంటి సమస్యలు తలెత్తరాదు

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలో ఎలాంటి సమస్యలు తలెత్తరాదని మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన దువ్వూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్, దువ్వూరు ఎస్‌ఐ వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్ రెడ్డి

అనాథాశ్రమంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

మాజీ ఎంపిపి మునిరాజా రెడ్డి కుమారుడు ప్రముఖ వైద్యులు డాక్టర్ కీర్తికర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కోడిగాండ్లపల్లి సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాథాశ్రమంలో ఆదివారం వైసిపి మండల అధ్యక్షులు నడమల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం అనాథలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరమేశ్వర రెడ్డి, గోపాల్ క్రిష్ణయ్య, సూర్యముని రెడ్డి, వాసు పాల్గొన్నారు.

ఆప్‌లో చేరిన యువతను అభినందిస్తున్న జిల్లా కో- ఆర్డినేటర్ రహమతుల్లా

ప్రజాసేవే ఆమ్‌ఆద్మీ పార్టీ లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజాసేవ దిశగానే ఆమ్‌ఆద్మీ పార్టీ అడుగులేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లె గ్రామానికి చెందిన మహమ్మద్, సమద్, హబిబ్ బాషా, షామీర్, పలువురు యువత ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరారు. వీరికి రహమతుల్లా టోపీలు పెట్టి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రహంతుల్లా మాట్లాడుతూ వేంపల్లెలో ఉన్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుండడంతో యువత తాము కూడా పోరాడుతామని ముందుకు వచ్చిందన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తున్న ఆప్ పార్టీని గుర్తించి యువత అందులో చేరడం సంతోషకరమన్నారు. ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ అమలు చేసిన పథకాలే నేడు కూటమి, బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతం కోసం యువత ముందుకు వచ్చి ఆప్‌లో చేరాలని కోరారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు బాబ్జీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పట్టని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టడంలేదని ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో ఎస్టీయు నాయకుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన ఆదివారం కడప జిల్లా ఎస్టీయు కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు లబ్ధి చేకూర్చడంతోపాటు గత ప్రభుత్వం చేసిన ఆర్థిక గాయాలను మాన్పుతామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నప్పటికీ 12వ పిఆర్‌సి కమిషన్ వేయలేదన్నారు. మధ్యంతర భృతి ప్రకటించలేదన్నారు. తాము ఇంకెంతకాలం ఎదురు చూడాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సెంట్రల్ కిచెన్‌ల పేరుతో గ్రామాల్లో, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న ఏజెన్సీల పొట్ట కొట్టి, వారి జీవనోపాధికి కూటమి ప్రభుత్వం తీవ్ర విఘాతం కలిగిస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. అనంతరం జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాబోవు రెండేళ్లకు నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎస్టీయు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గతం మర్చిపోకు ఆదినారాయణరెడ్డి : వైసిపి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గతం మర్చిపోయి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతున్నారని, అసలు వైఎస్ కుటుంబం లేకపోతే మీరు, మీ కుటుంబం ఏ స్థాయిలో ఉండేవారో తెలుసుకోవాలని వైసిపి నాయకులు మున్సివల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, నూర్‌బాషా సంఘ అధ్యక్షుడు రసూల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు మెప్పుకోసం ఆదినారాయణరెడ్డి వైఎస్ కుటుంబంపై మాట్లాడడం నీచమైన రాజకీయమన్నారు. పులివెందులలో గడిచిన జెడ్పీటీసీ ఎన్నికలలో సాక్షాత్తు డీఐజీ, ఇతర పోలీసు అధికారులను అడ్డంపెట్టుకొని దౌర్జన్యంగా దొంగ ఓట్లతో గెలిచిన గెలుపును రాయలసీమ బాషలో ఏమంటారో ఆదినారాయణరెడ్డికే తెలుసున్నారు. సాధారణ ఉద్యోగిగా ఉన్న మీరు రాజకీయంగా ఈ రోజు ఈస్థాయికి రావడం వెనుక ఉన్న కారణం ఏమిటీ అని ప్రశ్నించారు. ఈసారి పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, లింగాల మండల కన్వీనర్ అంబకపల్లె బాబు, కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి, ఖాదర్ బాషా, నాయకులు చంద్రమౌళి, సంపత్, విష్ణు, రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రమాదకరంగా సర్వీస్ రోడ్డు

సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ప్రజాశక్తి - చాపాడు

నెల్లూరు-బళ్లారి హైవే రోడ్డులో భాగంగా రాజకోట గ్రామం వద్ద ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్డు ప్రమాదకరంగా మారింది. మైదుకూరు నుంచి విశ్వనాథపురం గ్రామానికి వచ్చే మార్గంలో రాజకోటకు వెళ్లే రోడ్డు వద్ద ఏటూరు కాలువపై బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జిపై వేసిన రోడ్డు రెండు ప్రదేశాల్లో గుంతలు పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు వేగంగా వస్తూ గుంతలను చూసి అకస్మాత్తుగా ఆగుతున్నారు. వెనుక వైపు వస్తున్న కార్లు, ఇతర వాహనాలు ఢీకొంటూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డుకు మధ్యలో కెసి కాలువపై వేసిన కల్వర్టుకు ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు కెసి కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇనుప కడ్డీలను ఏర్పాటు చేస్తే ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంది. కెసి కాలువకు పక్కనే పాత బావి ఉంది. రోడ్డుకు పక్కనే బావి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు దానిలో ప్రమాదవశాత్తూ పడే అవకాశం లేక పోలేదు. బావికిపై వైపున ఎలాంటి సూచిక బోర్డులు, రక్షణ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. ఈ బావిలో పూర్తిస్థాయిలో నీరు ఉంది. రోడ్డుకు పక్కనే బావి ఉండడంతో ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఈ సర్వీస్ రోడ్డు కూడా చాలా తక్కువ వెడల్పు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి సర్వీసు రోడ్డులో ప్రమా దకరంగా మారిన ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, రక్షణగా ఇనుప చువ్వ లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డుకు పక్కనే ఉన్న రక్షణ లేని బావి

రక్షణ గోడ ఏర్పాటు చేయాలి

సర్వీస్ రోడ్డు ప్రారంభించి రెండు నెలలు కూడా కావడం లేదు. రెండు ప్రదేశాల్లో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో ఇవి సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వెనుక వైపు వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొంటూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డు చాలా తక్కువ వెడల్పుతో ఏర్పాటు చేశారు. ఎక్కడ కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వెంటనే అధికారులు స్పందించి సూచిక బోర్డులు రక్షణ గోడ ఏర్పాటు చేయాలి.

- ఈశ్వరయ్య, పుల్లారెడ్డి నగర్

అధికారులు చర్యలు చేపట్టాలి

ఏటూరు కాలువ దాటగానే సర్వీస్ రోడ్డుకు పక్కనే ఉన్న బావి ప్రమాదకరంగా ఉంది. బావిలో నిండుగా నీరు ఉంది. ఇక్కడ ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ఈ మార్గంలో కొత్తగా ప్రయాణించేవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- భాస్కర్ రెడ్డి, విశ్వనాథపురం

ఇనుప చువ్వలు ఏర్పాటు చేయని కెసి కాలువ

కూటమి ప్రభుత్వం డొక్కు, ట్రబుల్ ఇంజిన్

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం డొక్కు, ట్రబుల్ ఇంజిన్‌గా మారిందని పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.34,698 కోట్లు గ్రాంట్ రూపంలో రాష్ట్రానికి రాగా, కూటమి పాలనలో 2024-25లో కేవలం రూ.20,135 కోట్లు మాత్రమే గ్రాంట్ రూపంలో వచ్చిందని చెప్పారు. ముందు సంవత్సరం కంటే రూ.14.563 కోట్లు తగ్గిందని పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి 6 నెలల్లో కేంద్రం నుండి కేవలం రూ.4,014 కోట్లు మాత్రమే గ్రాంట్ వచ్చిందన్నారు. అదే సమయంలో 2023-24లో రూ.21,270 కోట్లు వచ్చిందని తెలిపారు. డబుల్ ఇంజిన్ వల్ల కేంద్రంలో రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉంటే రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందని నరేంద్ర మోడీ, చంద్రబాబు పదేపదే చెబుతుంటారన్నారు. దానికి ఇప్పుడు వారేమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలనలో రాష్ట్రంలో సంపద ఆవిరైందని విమర్శించారు.

బడ్జెట్‌లో మూలధన వ్యయం 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైసిపి పాలనలో రూ.23,589 కోట్లు కాగా, కూటమి పాల నలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.19,176 కోట్లు మాత్ర మే అన్నారు. అప్పులు చేయడంలో కూటమి ప్రభుత్వానికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం కేవలం 17 నెలల కాలంలో రూ.2 లక్షల 27 వేల కోట్లు అప్పుచేసి ఆల్ టైం రికార్డు సృష్టిం చిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్రం నుండి రాష్ట్రానికి ఎక్కువ గ్రాంటు తెప్పించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్‌కు తెప్పించి రాజమండ్రిలో ఏర్పాటు చేయాలని తులసి రెడ్డి సూచించారు.

పార్టీకి దోచి పెట్టాలని చూస్తున్న చంద్రబాబు

ప్రజాఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రయివేటీకరణ ముసుగులో పార్టీకి దోచి పెట్టాలని సిఎం చంద్రబాబు చూస్తున్నారని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆరోపించారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న వైసిపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన మైదుకూరు పార్టీ కార్యాలయంలో వైసిపి ప్రజాఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ర్యాలీలో ప్రజలు పాల్గొనాలని కోరారు. చంద్రబాబు ప్రతీది ప్రయివేట్‌పరం చేయాలని చూస్తున్నారన్నారు. వైఎస్ జగన్ నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలలను సైతం చంద్రబాబు ప్రయివేట్‌పరం చేస్తాడేమోనని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ పేరుతో తన తొత్తులకు ఇవ్వాలని చంద్రబాబు చూస్తున్నారన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీలోని అధునాతన పరికరాలను అక్కడి నుండి వేరే కాలేజీలకు తరలించడం దారుణమన్నారు. లక్ష కోట్లు విలువ చేసే ప్రజల ఆస్తులను ప్రయివేట్‌పరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు టి.లక్ష్మయ్య, రత్నకుమార్, శంకర్‌రెడ్డి, రాఘువరెడ్డి, కిర్మణయి, నాగేశ్వరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణను ఉపసంహకరించుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ఉపసంహకించుకోవాలని డిఎస్ఆర్ యువసేన డేని కోరారు. వైసిపి అధినేత జగన్, కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో నగరిగుట్ట క్రిస్టియన్ లైన్‌లో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డేని మాట్లాడుతూ పిపిపి పేరిట ముఖ్య మంత్రి చంద్రబాబు వైద్యకళాశాలలను ప్రయివేట్ పరం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

కోటి సంతకాల సేకరణపై ర్యాలీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఈ నెల 12న మెడికల్ కళాశాలల ప్రయివేటకరణను వ్యతిరేకంగా జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన పోస్టర్స్‌ను విడుదల చేశారు. బుధవారం జరిగే కోటి సంతకాల సేకరణపై జమ్మలమడుగులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి హృషికేశవరెడ్డి, పొన్నపురెడ్డిరెడ్డి గిరిధర్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి గజ్జల లక్ష్మయ్య, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, దేవగుడి చంద్ర పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ పిఆర్, నాయకులు

కృత్రిమ మేధతో విద్యలో నూతన ఆవిష్కరణలు

మాట్లాడుతున్న సైన్స్ క్లబ్ డివిజన్ అధ్యక్షులు వంశీకృష్ణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కృత్రిమ మేధతో విద్యలో నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని సైన్స్ క్లబ్ డివిజన్ అధ్యక్షులు వంశీకృష్ణ పేర్కొన్నారు. సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైవిఎస్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధికి కృత్రిమ మేధ అన్ని సబ్జెక్టులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్లబ్ గౌరవాధ్యక్షులు గోపీనాథ్‌రెడ్డి, విజయభాస్కర్ మాట్లాడుతూ ఏఐ సాంకేతికత విద్యారంగానికి మేలు చేస్తుందన్నారు. సలహాదారు రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు కృత్రిమ మేధ సాయంతో బోధనలో సృజనాత్మక మార్పులు తీసుకురావాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గామా యాప్, చాట్ జిపిటి, విజిల్ ఏ వన్ వంటి యాప్‌ల ద్వారా కృత్రిమ మేధను వినియోగించి బోధనను మరింత సులభంగా అర్ధవంతంగా చేయడంపై సమగ్ర అవగాహన కల్పించారు. సైన్స్ క్లబ్ సెక్రటరీ బి అల్లాబక్ష మాట్లాడుతూ సైన్స్ క్లబ్ కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో వినియోగించుకొని ఏవన్ ఫలితాలను విద్యార్థులకు అందించాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయులతో పాటు ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొని బోధనలో వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు భూములు చూపాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో అసైన్డ్‌మెంట్ లబ్ధిదారులకు, భూములు కొనుగోలు చేసిన పేదలకు భూములు పంచి భూ ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తుల మీద, నకిలీ రికార్డులకు సహకరించిన రెవెన్యూ అధికారుల మీద కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో ఆయన మాట్లాడారు. మండలంలో పదిహేను వేల ఎకరాలు భూ ఆక్రమణలు జరిగాయన్నారు. ఆయా గ్రామాల్లోని రాజకీయ, ఆర్థిక, అంగబలం ఉన్న వారు భూములను ఆక్రమించున్నారని తెలిపారు. అలాగే జిల్లాలో లక్ష ఎకరాల్లో భూ ఆక్రమణలు జరిగాయని సిపిఎం 15ఏళ్లుగా చెబుతూనే ఉందన్నారు. ఇందుకు నిదర్శనం మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఈ మధ్యకాలంలో వాటి వివరాలను ఆర్‌డిఒకు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్, బ్రహ్మంగారిమఠం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ మండల కమిటీ సభ్యులు హరి, అజయ్‌కుమార్, రాజశేఖర్, వాసు, లక్ష్మయ్య, బాలరాజు, అరవింద్ పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో న్యాయవాదులు

సామాజిక అవగాహన అవసరం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రతి ఒక్కరూ సామాజిక అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు విద్యార్థులకు న్యాయ సేవ ప్రాధికార సంస్థ, లోక్‌అదాలత్, బాల్య వివాహాల వల్ల కలుగు నష్టాలను, వరకట్న వేధింపుల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు చంద్రశేఖర్ రెడ్డి, సి.సుబ్బారెడ్డి, బివి సుబ్బారావు, జయన్న, స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా 'మసీద్ ఏ రియాజుల్ జన్నహ్' శంకుస్థాపన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, మాజీ ఎమ్మెల్సీ

పట్టణంలోని ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న మదరసాయే రియాజుల్ ఉలూంలో ఆదివారం వేలాదిమంది ముస్లిం మత పెద్దల ఆశీర్వచనాలతో 'మస్జిదె రియాజుల్ జన్నహ్' నూతన మసీదు శంకుస్థాపన చేశారు. జిల్లా, రాయలసీమ నుంచి ప్రముఖ ముస్లిం మత పెద్దలు, మదరసాల ముఫ్తీలు, ఉలమాలు, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ముస్లిం పెద్దలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఫ్తీ కరిముల్లా మాట్లాడుతూ నేటి కాలంలో ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కుటుంబం కోసం ఖర్చు చేయడంతోపాటు సమాజం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మసీదులు, మదరసాల నిర్మాణాల కోసం తమవంతు సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉలమాలు, ముఫ్తీలు రియాజ్, ఆన్సర్ అలీ, షబీల్ మౌలానా, భరత్ సప్లయర్స్ హుస్సేన్ పీరా, షేక్ ఉస్మాన్ బాషా, ముస్లిం మత పెద్దలు, మదరసాల నిర్వాహకులు, మదరసాల వేలాదిమంది విద్యార్థులు, చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఓబుళంపల్లి ఎడ్లకు మొదటి బహుమతి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయిపల్లి గ్రామంలో అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం ఓల్డ్ కేటగిరి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. మూడు జతల ఎడ్లు ఒకే దూరం లాగి మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. చెన్నూరు మండలం ఓబులంపల్లికి చెందిన సానపురెడ్డి సతీష్‌కుమార్ రెడ్డి ఎడ్లు, కడప రూరల్‌లోని రూకవారిపల్లెకు చెందిన బొజ్జ విద్యఓబుల్‌రెడ్డి ఎడ్లు, వరదాయపల్లెకు చెందిన బెస్త శ్రీరాములు ఎడ్లు 4,400 అడుగులు లాగాయి. వీటికి మొదటి మూడు బహుమతులను కేటాయించారు. అక్కంపల్లి గ్రామానికి చెందిన కోనేపల్లి ఇంద్రారెడ్డి ఎడ్లు 4,382 అడుగులు లాగి నాల్గవ బహుమతి కైవసం చేసుకున్నాయి. వల్లూరు మండలం గోసులవారి పల్లెకు చెందిన పామిరెడ్డి వెంకటమోహిత్ రెడ్డి ఎడ్లు 4,246.2 అడుగులు లాగి 5వ స్థానంలో నిలిచాయి. బండలాగుడు పోటీలకు వ్యాఖ్యాతగా గంగారు చంద్రమోహన్‌రెడ్డి వ్యవహరించారు. 6 పండ్ల విభాగంలో ఎడ్లకు పోటీలు నిర్వ హించారు. ఈ పోటీలకు గంగిరెడ్డి శివమారుతిరెడ్డి యాంకర్‌గా వ్యవ హరించారు.

బ్రహ్మంగారి వారసులను సన్మానిస్తున్న కుమ్మెర హరి కుటుంబ సభ్యులు

గృహప్రవేశానికి హాజరైన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారసులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీశ్రీశ్రీజగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి కొమ్మెర హరినాథ్ ఆహ్వానం మేరకు పోతులూరి వారసులు హాజరయ్యారు. ఆదివారం పట్టణ పరిధిలోని కడప రోడ్డులోని హనుమాన్ నగర్‌లో నూతన గృహప్రవేశానికి బ్రహ్మంగారి మఠం పోతులూరి వీరబ్రహ్మేంద్ర వారసులైన బ్రహ్మంగారి పూర్వ పీఠాధిపతి వీర భోగ వసంత వెంకటేశ్వర స్వామి వారి జ్యేష్ఠ పుత్రుడు శ్రీశ్రీశ్రీవెంకటాద్రి స్వామి ధర్మ పత్ని ఉమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమ్మెర హరినాథ్ ఆయన భార్య లక్ష్మీదేవిచే ప్రత్యేక పూజలు చేయించారు. కుటుంబ సభ్యు లు, తంబిశెట్టి అమర్నాథ్, సతీమణి పద్మావతి, ఎక్స్ కౌన్సిలర్ మాధవాచారి పాల్గొన్నారు.

నాగనాథేశ్వర కోనపైకి వాహన రాకపోకలు నిలుపుదల

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని ఉన్న నాగ నాథేశ్వర కోన పైకి వాహనాలను అనుమతించడం లేదని సీఐ వంశీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసు కున్నామన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు అనుమతిలేదన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆయన కోరారు. వాహనాల పార్కింగ్ కోన కింద ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల ఆంక్షల పట్ల అభ్యంతరం పలువురు వ్యక్తప రుస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి నిర్ణయాలు ఆలయ పాలకవర్గం, పోలీసులు తీసుకోలేదంటున్నారు. భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండపైకి వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలను ఎందుకు అనుమతించరని పలువురు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్, దేవాదాయశాఖ అధికారులు ఈ నిబంధన పట్ల ఆలోచించాలని పలువురు సూచిస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి

ఎర్రగుంట్ల : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆదివారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. చిలంకూరు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద రోడ్డుపై గత నెల 13న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆ వృద్ధుడు తీవ్రంగా గాయ పడ్డాడు. ఆ వ్యక్తిని చిలమకూరుకు చెందిన వేణు అనే వ్యక్తి 108 అంబులెన్స్ ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడన్నారు. అతడిని ప్రొద్దు టూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చూరీలో ఉంచారని, గుర్తు పడితే సమా చారం తెలపాలని సిఐ కోరారు.

మహారాజశ్రీ
2వ అదనపు జిల్లా కోర్టు, ప్రొద్దుటూరు
E.P.No. 97/2019 in
A.C.No.MS/SF/102 of 2015
M/s సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ Rep by the Branch Manager, Proddatur ...Petitioner/D.Hr
VS
01) జి.రాజశేఖర్ రెడ్డి,S/o శివారెడ్డి,డి.నెం.3/18ఎ, మెయిన్ బజార్,కమలాపురం,కడప జిల్లా
9) వి.గంగిరెడ్డి, S/o వి.చెన్నారెడ్డి, డి.నెం.2, అగస్థలింగాయ పల్లె గ్రామం, కమలాపురం(మం) కడప జిల్లా. ... Respondents/J.Drs

సేల్ నోటీస్

పై తెలిపి EP నందు రెస్పాండెంట్ అయిన మీరు EP మొత్తం కట్టనందున పిటిషనరు పై EP నందు పిటిషనర్ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం ద్వారా అమ్మి సదరు మొత్తం పిటిషనర్‌కు ఇప్పించు లాగున పై EP ని దాఖలు చేసి యున్నారు. పై పిటిషన్ నందు మీకు ఆర్డర్ 21 రూల్ 66 ప్రకారం సేల్ నోటీసు ఇవ్వమని పై కోర్టు వారు ఆదేశించియున్నారు.

పై పిటిషన్ నందు మీరు హజరగుటకుగాను **11.11.2025**వ తేదీన వాయిదా ఉన్నది. కావున ఆ తేదీన ఉదయం **10.30 గంటలకు** మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారాగా హజరై ఆక్షేపణలు తెలుపు కోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

// BY ORDER OF THE COURT //

జింకా రవి, అడ్వకేట్, ప్రొద్దుటూరు,